# పెన్షన్

పోష్టుమాన్ రామయ్యకు ఆ సాయంత్రమే పాపం ఉద్యోగ విరామ పత్రము చేతికిచ్చారు. అతను నిర్వీర్యపోయి నుంచున్నాడు. "రేపటినుంచి నీవు ఆఫీసుకు రానవసరం లేదయ్యా" అన్నాడు పోష్టుమాష్టరు. రామయ్యకు 55 ఏండ్లు నిండాయి. అంచేత రిటైర్ అయ్యాడన్నమాట.

ఉద్యోగంనుంచి రిటైర్ అయ్యాడేగాని గృహ యాజమాన్యమునుంచిమట్టుకు రిటైర్ కాలేదు. పెండ్లి చెయ్యాల్సిన ఎదిగిన ఆడపిల్లలు యిద్దరు ఇంట్లో వున్నారు. మగపిల్లలు అంతకంటే చిన్నవాండ్లు, స్కూల్లో చదువుతున్నారు. కనీసం వుప్పో, కారంతోనైనా పూటకుపూట జరిగిపోవాలి.

రామయ్య నిర్వీర్యపోడానికి కారణం ఉంది. ఇదివరకు ప్రభుత్వం 60 ఏండ్లవరకు సర్వీసు పొడిగిస్తుందని వార్తా పత్రికల్లో చూస్తూ వుండేవాడు. తనకు కూడా అయిదేళ్లు ఇంకా సర్వీస్ ఉంటుందని ఆశపడ్డాడు. కాని ఈ పత్రం చూసేసరికి గుండెల్లో రాయిపడ్డట్టయింది రామయ్యకు. గుడ్డిలో మెల్ల అన్నట్టు ఆరోజు ఒకటో తేదీ అయినందున జీతంకూడా చేతికిచ్చారు.

కానీ ఏం ప్రయోజనం? అంతకుముందు నెల పొడుగునా ఇంటి వెచ్చాలకు చేసిన బాకీలకు అప్పుడు తీసుకొన్న పైకంలో మూడువంతులు అదృశ్యమయింది. ఇక మీదటకూడా ఖర్చు లేమో మామూలే. కాని జీతం సన్నగిల్లింది. ఇంకేమి చేస్తాడు?

ఇంటికెళ్ళి భోజనాలైన తరువాత చావు కబురు చల్లగా భార్య చెవిలో వేశాడు ఈ మాట. ఆడవాండ్లనోట్లో మాట దాగుతుందా? కొంగున నిప్పు దాచినట్లే! వూరంతా పాకిపోయింది. పాత బాకీలవాళ్ళు లేచివచ్చారు, తుఫానంతా వీండ్ల యింటిమీదకే వచ్చిపడ్డట్టు. వాళ్లు ఆసరాలకూ, వాయిదాలకూ చెవి వొగ్గుతారా? ఆ మిగిలింది కూడా క్షణంలో నిండుకొంది.

రామయ్య పట్నంలో వుండటం సబబు కాదని, మకాం పల్లెటూరికి మారుద్దామనుకొన్నాడు. అక్కడైతే అనవసరమైన యింటి అద్దె, యింకా ఎన్నో ఖర్చులు తప్పుతాయని, తిన్నా తినకపోయినా ఎవ్వరూ అడిగేవాండ్లు, హేళన చేసేవాళ్లు వుండరని అనుకున్నాడు. కాని పిల్లల చదువుల విషయం జ్ఞాపకం వచ్చింది.

రామయ్య ఆ రాత్రి సరిగా భోజనం చెయ్యనూ లేదు; నిద్రా లేదు. ఇంతలో తనకు వుద్యోగ నిర్వహణలోని పూర్వస్మృతులు ఒకటివెంట ఒకటి జ్ఞాపకం వచ్చాయి. తను ఎంతమంది జవరాండ్ర భర్తల చావుజాబులు, టెలిగ్రాములు తన చేతులతో అందించి ఎన్ని యిండ్లలో దుఃఖశోకాలకు నాంది పలికాడో! నఫరు యింట్లో వుండగా ఒకసారి, ఏదో రెండు, మూడు రూపాయలకు ఆశపడి, నఫరు హాజరు లేదని రిజిష్టరు నోటీసులను జారీ చేయకుండా తిరిగి పంపివేశాడు.

## శ్రీ సి. వి. సుబ్బారావు

ఒకరోజున తన పేటపక్కనే జరిగిన విచిత్ర సంఘటన జ్ఞాపకం వచ్చింది రామయ్యకి. ఆ 64 నెంబరు యింటి యజమాని బంగారువ్యాపారం చేసేవాడు. చాలకాలం వరకు అతనికి పిల్లలు లేరు. పొద్దస్తమానం షాపులోనే కూచునేవాడు. లాభం వస్తుంటే భోజనం చేసిందీ చేయందీ కూడా మర్చిపోయి అలాగే కూర్చొని వుండిపోతారు వ్యాపారస్థులు! భార్యమీద ఏదో అనుమానం. అంచేత రోజూ రాత్రి యింటికి రాగానే కీచులాడుకోటం పరిపాటి అయిపోయింది వాళ్లకు. మళ్లీ తెల్లారి లేవడం, దినచర్యలకు వుపక్రమించడం. ఇలా జరుగుతూ వుండేది. ఒకరోజు ఆయన యింటికి వచ్చేసరికి ఆవిడ ఎవరో భర్తకు తెలియని వ్యక్తితో మాట్లాడుతూ వుంది. తను వచ్చినా ప్రసంగం విరమించలేదు. ఆ కొత్త వ్యక్తి ఆయనను యింతకు ముందు చూచి వుండలేదు. కనుక ఆయన్ని చూచి ముఖమైఖరి అదోలా మార్చాడు. యింక చెప్పాలా? అనుమానపురుగు బాగా తలకు ఎక్కిపోయింది. ఆవిణ్ణి తర్వాత అడిగాడు. "అతను మావాడే. మావూరి వీరయ్య బాబాయిగారి వీరభద్రరావు" అని చెప్పింది. కానీ అతడు నమ్మలా.

తన భార్య నిజంగా తన్ను ప్రేమిస్తుందా లేదా అని పరీక్ష చేయదల్చుకున్నాడు. "వ్యాపారంమీద బొంబాయి వెడుతున్నాను. నాలుగైదు రోజులవరకు రాను. ఇల్లు జాగ్రత్త" అని చెప్పి తెల్లారుఝామునే బయల్దేరి వెళ్ళాడు. వెళ్ళిన మూడవనాడే టెలిగ్రాము వచ్చింది భార్యకు. ఎవరో అతని స్నేహితుడు ఇచ్చినట్టుంది "నారాయణరావు ఈరోజు 3 గంటలకు స్వర్గస్థుడయ్యాడు" అని మాత్రమే వుంది అందులో. అడ్రెసూ, ఎక్కడపోయిందీ తెలుపలేదు.

ఆ టెలిగ్రాముకూడా రామయ్యే మోసుకపోయి ఆమెకు ఇచ్చాడు. ఇంక చెప్పాలా. ఒకటే కాకిగోల. చుట్టుపక్కలవాళ్ళు చేరుకున్నారు. కావలసిన కర్మకాండంతా జరిగిపోయింది. వితంతువుకు జుట్టు తీసివేసే ప్రశ్న వచ్చింది. పిల్ల తరఫువారు, "అట్టే దాని కెన్నేళ్ళున్నాయి, ఈరోజుల్లో పెద్ద పెద్దవాండ్లే జుట్టు వుంచుకొంటున్నారన్నా"రు. కొందరు "తప్పకుండా తీయాల్సిందే తలమీద నీడే పోయాక జుట్టువుండి వుద్ధరిస్తుందా?" అన్నారు. భార్య రుద్ధకంఠంతో "వారు లేకపోయాక ఈజుట్టు ఎందుకు?" అని ముండనం చేయించుకొంది.

అప్పటికి సరిగ్గా 15 రోజులైంది. ఇంతలో అయ్యగారు యింటికి వచ్చారు. తలుపు వేసివుంది. "ఓహోయ్, ఒసే, సుభా" అని పిలిచాడు. జవాబు లేదు. నాల్గోసారి ఎవరో తలుపు తీశారు.

నారాయణను చూసేసరికి ఇంట్లో అందరికీ భయము, విస్మయము కలిగాయి. అతనివంక చూడ్డమే కాని ఎవరికీ నోట మాట పెగల్లేదు. "ఏమిటది? ఎందుకిలా విస్తుబోయి చూస్తారు? మా ఆవిడ యింట్లో లేదా?" అంటూ లోపలికి సరాసరి వెళ్ళిపోయాడు. అంతవరకు ఆవిడ వినిపించుకోలేదు. అతన్ని చూసేసరికి ఆమెకు ఒక్కసారి గుండె ఆగినట్లయింది. తన కండ్లను తానే నమ్మలేకపోయింది. చెవులు పనిచేయక బధిరాలై పోయింది. ఏమిటే యీ వేషం "పొరపాటు. కళ్లుపోతివి. తిరుపతి వెళ్ళొచ్చానా!" అన్నాడు తను పాగా [illegible] గాబరానుండి బయటపడి అందరూ జరిగిన విషయం, చెప్పారు. వద్దనేకొద్దీ గారు,

పోయాక నాకు ప్రపంచంతో ఏంపని అని ఆవిడే ముండనం చేయించుకుందని చెప్పారు.

రామయ్యా కిలా ఎన్నెన్నో జ్ఞప్తికి వచ్చాయి. క్రమంగా కొంతసేపటికి కొంచెం కునుకుపట్టింది. నిద్రలోకూడా ఈ విషయాలే. తాను దారా పుత్రాదులను వదిలి చనిపోయినట్లు, దూతలు తన యాతనా శరీరాన్ని యముడిముందు వుంచినట్లు కలవచ్చింది.

*     *     *

యముడు : ఎవరు వీడు ?

దూతలు: పోష్టుమాష్ రామయ్యప్రభూ.

చిత్రగుప్తుడు రామయ్యా చేసిన పాపాల ఖాతా పుస్తకము యముడికి అందించాడు.

యముడు : ఏం రామయ్యా? నీ పేరు మంచిదే. కాని నీవు పెద్దపాపాలు చేశావు.

రామయ్యా : చిత్తం ప్రభూ! నేను ఏ పాపమూ చేయలేదే! కానీ మనియార్డరు జారీ చేసేప్పుడుమట్టుకు, వంద రూపాయల మనియార్డరైనా సరే తొమ్మిది పది రూపాయిల కాగితాలు, తొమ్మిది రూపాయి కాగితాలు యిచ్చి ఒక రూపాయి చిల్లర యిచ్చేవాడ్నండి.

యముడు: అలా ఎందుకు చేసేవాడివి? నూరు రూపాయలనోటు, లేకుంటే పది రూపాయల కాగితాలు గాని ఎందుకు యివ్వకూడదూ?

రామయ్యా : చిత్తం ప్రభూ. ఏదైనా ఒక పావలాడబ్బులు గిట్టుతవని.

యముడు : ఛీ! యిది రాజద్రోహం కాదూ? జీతం తీసుకొంటూ పైగా మనియార్డరుకు పావలా, అర్ధరూపాయి కాజేస్తావా?

రామయ్యా : కాదు స్వామీ. జీతం పట్టుకెళ్లి ప్రతినెలా మొదటి తేదీ మా ఆవిడ దోసిట్లో పోసేవాడ్ని. అదిమట్టుకు ఏం చేస్తుంది? కాపురం నెట్టాలిగా. అందులో నా చేతికి మళ్ళీ కానీ వచ్చేది కాదు. అంచేత ఎప్పుడైనా కాఫీకి, బీడీలకు ఈరూపకంగా సంపాదించుకొనేవాడ్ని.

యముడు : ఆ వెధవ బీడీలు, కాఫీనీళ్లు మాని వుండలేవా!

రామయ్యా : అసాధ్యమేనండీ! పొద్దుటి నుంచి చూస్తున్నాను. బీడీ పిచ్చి బాగా వుంది. ఇక్కడెక్కడా బీడీకొట్లు కనిపించటం లేదు.

యముడు: మేమంతా పొగ తాగుతున్నామా? నోరుముయ్యి.

రామయ్యా : ఇక్కడవరకూ ఇంకా బీడీ, చుట్టా, సిగరెట్టుషాపులు పాకినట్టు లేదు ప్రభూ! మహా పిచ్చి అలవాటు. అవి మరిగితే బ్రహ్మకూడా మానలేడు.



"చావుకబురు చల్లగా భార్యచెవిని వేశాడు."

యముడు : నీవు 2-7-41 తేదీ మూడు రూపాయలు లంచము తీసుకొని, బసవయ్యా యింట్లో వున్నాగూడా భరణపుదావా నోటీసు జారీ చేయలేదు గదూ?

రామయ్యా : అట్లాంటి పద్దు లేకుంటే మేమింక అడుక్కు తినాల్సిందే. ఒక్క చాక్కాగుడ్డకు బుద్ధి గడ్డితిన్నది.

యముడు: గవర్నమెంటు మీకు దుస్తులు యిస్తుంది కాదూ?

రామయ్యా : రెండు జతలిస్తే ఈ వేసవి కాలంలో పక్కవాండ్లతో మాట్లాడటానికి వీలుండదండి. అంటే పీనుగులు కుళ్లినవాసన

యముడు : నీవు విలేజి పోష్టుమాన్‌గా వుండేటప్పుడు, వుత్తరం ఏరోజు వచ్చినా, నీవు ఆవూరికి వెళ్లేరోజు, ఆ తేదీముద్ర కొట్టి మరీ వెళ్ళి యిచ్చేవాడివి కాదూ?

రామయ్యా : మరేనండి. 20 పల్లెలకు ఒక్కణ్ణి. రోజూ తిరగటానికి మావి తోలుపాదాలేనండి, యినుపకాళ్లు కాదు.

యముడు : (గడువు మూచి) నీకు మరణ

(54 వ పేజీ చూడండి)

# ★ పెన్షన్ ★

(11-వ పేజీ తరువాయి)

కాలం యింకా సమీపించలేదు. ఏదో పొరబాటున దూతలు తీసుకువచ్చి వుంటారు. అంచేత యింటికివెళ్లి సంసారం దోర్లించు! పో.

రామయ్య : మానవుల ప్రభుత్వాల్లో వున్నట్టు, మీ ప్రభుత్వంలోగూడా ఒకరికి బదులు యింకొకరిని ఏడిపించడము కూడా వుందన్నమాట! సరే! అది నాకెందుకు గాని, ఆ సంసారభారం నాకు వద్దు ప్రభూ! ఓడీలు లేకపోతే మానె, నేనిక్కడే వుండిపోతాను. ఇంటికి వెళ్లితే రెపటినుంచి గడవటమూ కష్టమే. పైగా పెండ్లి కెదిగిన ఆడపిల్లలు యిద్దరూ, చదువుకునే ఇద్దరు మగకుంకలూ వున్నారు నా ప్రాణాలు పీకుకొంటుంది, సంసారం. నేను మళ్లీ వెళుతున్నాను. నేను ఇక్కడే వుండిపోతాను.

యముడు : మా పనులు మాకు చాలు. నీ గొడవెందుకు వెళ్లు. ఆఫీసు పని చూచుకోవాలి పో.

రామయ్య : నేను పడితే డబ్బులేకండా ఆ సంసార రథచక్రాలు తిరగవు స్వామీ! ఏదో వుపాయం చెప్పండి.

యముడు : దేవుడే యిస్తాడు పో.

రామయ్య : ఈ మాటలతోనే, పెద్దలు ప్రపంచాన్ని మోసగిస్తున్నారు. ఈమాటల మీద నమ్మకంతోనే నేను యింతవరకు నెట్టుకొచ్చాను. యిక నాకు దుస్సాధ్యము.

యముడు : పోతావా, బయటికి గెంటించమంటావా.

రామయ్య: ఈలోకంలోనూ ఈ దౌర్జన్యము వుందన్నమాట! దూరపు కొండలు నునుపు! అన్ని ప్రభుత్వాలు కొంచెము యించుమించుగా ఒకటే నన్నమాట! సరే మా లోకమే వెళ్లి, కలో, గంజో తాగి వుంటాను.

ఇంతలో రామయ్య భార్యవచ్చి "ఇంత పొద్దెక్కినా యింకా పడుకొంటే కాపరం బాగా గడిచినట్లే", అని నాల్గు పెట్టేసరికి, నిద్రమత్తుపోయి నిటారుగా లేచి నుంచున్నాడు రామయ్య. సరే తప్పేదిలేదుగా! ఆ సంసార సాగరంలో తెంపులేని కష్ట తరంగాల్లో తేలుతూ, మునుగుతూ, ఈదుతున్నాడు వుద్యోగం వూడిన పోష్టుమాన్ రామయ్య. ★

# ★ పుణ్యానికిపోతే ★

(35-వ పేజీ తరువాయి)

చేస్తున్నావురా. యీ పాడు బ్రతుకు బ్రతికే కంటే చావరాదూ" అని మరొకాయన అన్నాడు.

"మొన్న మామసిద్ది యిలాగే బియ్యం తెస్తుంటే, నేను తీసుకొస్తానంటూ యెవడో అంటే, మామసిద్ది వాడికామాట యిచ్చిందట. వెంటనే ఆదొంగ పరారైనాడు. అటువంటి వాడే వీడూను" అన్నాడొకతను.

"ఈరేపను రోజుల్లో బియ్యం దొరక్క మాడుతూంటే, నువ్వేవడప్పరా! పోతులా గున్నావు" ఏదన్నా కూలిపని చేసుకోకూడదూ" అన్నాడు ఎత్తిపొడుస్తూ మరొకాయన.

యివన్నీ వింటూంటే కోదండపాణికి కళ్లంట నీళ్లు గిరగిరా తిరిగాయి. "తండ్రి చెప్పినట్లు యితరులకు సాయం చేద్దామనుకొని చివాట్లకు, దెబ్బలకు గురి అయ్యాడు.

విచారంతో తనవూరు వచ్చాడు; జరిగిందంతా తల్లితో చెప్పాడు.

"అవును నాయనా, యీ కాలంలో మంచికి పోతే చెడు వస్తుంది. మీనాన్న చెప్పినట్లు యితరులకు సహాయం చేయడం మంచిదే. కాని అలాచేస్తే యీపాడు ప్రపంచంలో విలువ లేదు. పుణ్యానికి పోతే పాపం యెదురౌతుంది. ఎవరి మానానవారు పోతే మంచిది" అని తల్లి ఓదార్చింది.

"అవును, నిజమే. యీ కాలంలో మంచికి, న్యాయానికి తావులేదు. అమ్మ చెప్పినట్లు పుణ్యానికిపోతే పాపమే యెదురౌతుంది" అని అనుకొని వూరుకున్నాడు కోదండపాణి. ★

సిద్ధముగ నున్నది.
డాన్ క్విక్ సెట్
(DON QUIXOTE)



మూలం :
సెరివాన్టెజ్
అనువాదం :
విశ్వాత్ముల నరసింహమూర్తి
తపాల ఖర్చు ప్రత్యేకం.
వెల రెండురూపాయలు
ఆంధ్ర గ్రంథమాల
మద్రాసు 1.

కాంచన ద్వీపం
వెల 1-8-0
పోస్టుఖర్చులు ప్రత్యేకం.
ఆంధ్రగ్రంథమాల, మద్రాసు-